సాక్షి
కామారెడ్డి
గురువారం । 11 । జూలై । 2024



ప్రైవేట్‌కు దీటుగా బోధించాలి

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ విద్యాశాఖ అధికారులకు సూచించారు.

- 8లో ▸



రూ. 250 కోట్లతో..

ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని రూ.250 కోట్లతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.5 /22.9

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు

బాన్సువాడ : బాన్సువాడ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించే అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. డ్యూటీలు, సెలవుల విషయంలో అసిస్టెంట్ మేనేజర్ డబ్బులు తీసుకుంటున్నారని, వేధింపులకు గురిచేస్తున్నారని కార్మికులు, సిబ్బంది ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారం పాటు విజిలెన్స్, ఆర్టీసీ అధికారులు బాన్సువాడ డిపోలో విచారణ జరిపి, నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. నివేదికను పరిశీలించిన ఉన్నతాధికారులు.. అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్‌ను సస్పెండ్ చేశారని డిపో మేనేజర్ శ్రీదేవి తెలిపారు.

రేపు కామారెడ్డి బల్దియా కౌన్సిల్ సమావేశం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి కౌన్సిలర్లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

భారీ చేప లభ్యం



ఎల్లారెడ్డిరూరల్: నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో జాలరులకు బుధవారం భారీ చేప చిక్కింది. సోమార్‌పేట్ గ్రామానికి చెందిన అంజయ్య వలలో 28 కిలోల భారీ చేప చిక్కిందని స్థానికులు తెలిపారు. భారీ చేపను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

మొగి పురుగుపై అప్రమత్తంగా ఉండాలి



బీబీపేట: ప్రస్తుతం పంటలను ఆశిస్తున్న మొగి పురుగు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్ గ్రామాలలో పంటలను పరిశీలించారు. పత్తి, మక్కలలో కలుపు యాజమాన్యం, వరి నారుమళ్లలో ఆశిస్తున్న మొగి పురుగు నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఆమె వెంట ఏఈవో రాఘవేంద్ర, రైతులు ఉన్నారు.

ప్రజలకు అండగా నిలుస్తాం



నిజాంసాగర్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న పేదలకు సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలుస్తామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో నియోజకవర్గానికి చెందిన పలువురు ఆయనను కలిశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో వినోద్, సాయిలు తదితరులు ఉన్నారు.

15 నుంచి తరగతులు ప్రారంభం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా(ఎస్‌ఆర్‌ఎన్‌కే) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 15 నుంచి ఫస్ట్ సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయ పాలన పాటిస్తూ తరగతులకు హాజరు కావాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై కంట్రోల్ రూం ఏర్పాటు

సుభాష్‌నగర్: సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లాస్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడైనా సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే 73864 29323, 90597 64785 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమాచారం ఇవ్వొచ్చని పేర్కొన్నారు. వ్యాధులకు సంబంధించిన సమాచారం అందిస్తే యుద్ధ ప్రాతిపదికన వైద్య బృందాలు చర్యలు తీసుకునేలా సన్నద్ధం చేశామని తెలిపారు.

ఆ ఏడు గంటల్లోనే..

జిల్లాలో ఏటా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఆయా ప్రమాదాలలో దాదాపు రోజుకొకరు చొప్పున మృత్యువాతపడుతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్న పోలీసులు.. యాక్సిడెంట్లు ఎక్కువగా మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్యే జరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో వాహనదారులను కట్టడి చేయడానికి తనిఖీలను ముమ్మరం చేశారు.



- మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల మధ్యే ఎక్కువ ప్రమాదాలు
- సగానికిపైగా యాక్సిడెంట్లు ఆ సమయంలోనే...
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- కట్టడికి తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ఈ ఏడాది జనవరి 1 నుంచి జూలై 10వ తేదీ వరకు 279 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 148 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయాల పాలయ్యారు. కొందరు తీవ్ర గాయాలతో మంచానికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ప్రమాదాల తీరును ఎస్పీ సింధు శర్మ సునిశితంగా గమనించారు. యాక్సిడెంట్లు ఎక్కువగా మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్యే జరుగుతున్నట్టు గుర్తించారు. ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన 279 రోడ్డు ప్రమాదాల్లో 142 ప్రమాదాలు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 మధ్యలోనే జరిగినట్లు పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

కట్టడి చర్యలు..

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగిన నేపథ్యంలో ఎస్పీ సింధు శర్మ ఆదేశాల మేరకు పోలీసులు రోజూ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడినవారి వాహనాలను సీజ్ చేస్తున్నారు. మద్యం తాగి వాహనాన్ని నడిపినవారిని కోర్టుకు పంపిస్తున్నారు. కోర్టు జైలు శిక్ష విధిస్తున్నా కొంత మంది వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌తో అనర్థాలు..

శుభకార్యాలతోపాటు ఆఖరుకు చావులకు వెళ్లినా సరే మర్యాద పేరుతో మద్యం సేవించడం చాలామందికి అలవాటుగా మారింది. నలుగురు చుట్టాలో, స్నేహితులో కలిస్తే మద్యం సిట్టింగ్ ఉండాల్సిందే.. అలాగే మొక్కుల పేరుతో దేవాలయాల వద్దకు వెళ్లినా మద్యంతో విందు ఏర్పాటు చేస్తుంటారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాతే ప్రమాదాలు జరగడంలో మధ్యాహ్నం దావత్‌లే కారణమని స్పష్టమవుతోంది. కొందరు రోజూ మందుతాగుతారు. సాయంత్రం అయ్యిందంటే చాలు మద్యం సేవిస్తారు. శుభాశుభ కార్యాలతోపాటు స్నేహితులతో మద్యం సిట్టింగ్‌లు వేసినవారు.. మద్యం తాగి వాహనాలను నడుపుతుండడం ప్రమాదాలకు కారణమవుతోంది. సాయంత్రం నుంచి రాత్రి వరకు వైన్‌షాపుల వద్ద మద్యం కొనడానికి జనం బారులు తీరి కనిపిస్తారు. మద్యం కొనుగోలు చేసి ఎక్కడో ఒకచోట తాగి వాహనాలపై ఇళ్లకు వెళ్లే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల మధ్యే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించాం. అందుకే ఆ ఏడు గంటల సమయంలో వాహనాల తనిఖీలు ఎక్కువగా నిర్వహిస్తున్నాం. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనం నడపడం, నంబర్ ప్లేట్లు లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్ వంటి వాటి విషయంలో సీరియస్‌గా వ్యవహరిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినవారితో పాటు గాయపడ్డ వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకొని జాగ్రత్తగా వాహనాన్ని నడపాలి. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి.

– సింధుశర్మ, ఎస్పీ, కామారెడ్డి

అనుమతి లేని ఆస్పత్రులకు నోటీసులివ్వండి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: అనుమతి లేని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ ఆమోదించిన తర్వాతే ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతి ఇవ్వాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు ప్రతినెల నివేదికలు, రోజువారి ప్రసవాల వివరాలు, సీజనల్ వ్యాధుల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి అందించాలన్నారు. సంవత్సరానికి ఒకసారి రిజిస్ట్రేషన్ పొందిన ఆస్పత్రులను సందర్శించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. మూడు నెలలకు ఒకసారి జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ మీటింగ్ నిర్వహించాలన్నారు. దరఖాస్తులో నమోదు చేసిన వైద్యులు కాకుండా ఆస్పత్రిలో ఇతర వైద్యులు, వైద్య సేవలను అందిస్తే సదరు ఆస్పత్రిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మగ పిల్లలు పుట్టడానికి మందులు పోసే వారిపైన, ఆస్పత్రి యజమాన్యంపైన కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి అరవింద్ కుమార్, ప్రోగ్రాం అధికారులు శోభారాణి, శిరీష, అధికారులు వేణుగోపాల్, చలపతి తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన కాసుల బాల్‌రాజ్

ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రావు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – బాన్సువాడ

సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఆయిల్‌పాం సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉద్యానవనశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 610 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 403 ఎకరాల్లో మొక్కలు నాటారన్నారు. రైతులకు అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వనమహోత్సవంలో భాగంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా ఇప్పటివరకు 30 వేల మొక్కలు నాటారన్నారు. మిగతా మొక్కలను సకాలంలో నాటాలన్నారు. మాల్తుమ్మెద హార్టికల్చర్ ఫాం, భిక్కనూరు మండలంలోని బీటీఎస్ వద్ద ఉన్న సిల్క్‌ఫాంను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: ప్రమాదాలు జరకుండా స్కూల్ బస్సుల డ్రైవర్లు, యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యా సంస్థల బస్సు డ్రైవర్లు, యాజమాన్యాలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. జిల్లాలో 98 శాతం బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ చేయించామని జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రవాణా శాఖ సిబ్బంది శ్రీనివాస్, నాగలక్ష్మి, భిక్షపతి, విక్రమ్, రజనీబాయి, స్యామ్ రిచర్డ్స్, అఫ్రోజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు

అన్నింటా ఆమె మేటి!



- అన్ని రంగాలలో రాణిస్తున్న అతివలు
- అయినా ఆడపిల్లలపై తగ్గని వివక్ష
- భారంగా భావిస్తూ కడుపులోనే చిదిమేస్తున్న తల్లిదండ్రులు
- ఉన్నతంగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలుస్తున్న పలువురు

సాక్షి, కామారెడ్డి: ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారు. చదువు, ఉద్యోగంతోపాటు ఆటల్లోనూ వారు ముందుంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎంతోమంది బాలికలు వివిధ రంగాల్లో మన దేశ కీర్తిని ప్రపంచానికి చాటారు. మన ప్రాంతం నుంచి దేశ, విదేశాల్లో ఎంతో మంది మహిళలు వైద్యులుగా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రొఫెసర్లుగా, పరిశోధకులుగా పనిచేస్తూ జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటుతున్నారు. పిట్లం మండల కేంద్రానికి చెందిన ప్రతిభ ఏడు రకాల యుద్ధ క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. తాడ్వాయి గురుకుల పాఠశాలలో చదివిన మలావత్ పూర్ణ.. ప్రపంచంలోనే పిన్న వయసులో ఎవరెస్టు ఎక్కి రికార్డు నెలకొల్పింది. నిజామాబాద్ నగరానికి చెందిన నిఖత్ జరీన్ బాక్సింగ్‌లో అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతోంది. ఇందూరుకే చెందిన యెండల సౌందర్య హాకీలో, సౌమ్య ఫుట్‌బాల్‌లో జాతీయ మహిళా జట్లకు ప్రాతినిధ్యం వహించారు. సోమారంపేటకు చెందిన వెన్నెల ఎల్‌బ్రస్ పర్వతాన్ని ఎక్కింది. ఎవరెస్టు ఎక్కాలన్న లక్ష్యంతో శ్రమిస్తోంది. ఇలా ఎందరో ఆయా రంగాలలో దేశ కీర్తిని ఇనుమడింపజేశారు.

కామారెడ్డి జిల్లా తొలి ఎస్పీ మహిళే.. జిల్లా తొలి ఎస్పీగా సేవలందించిన ఎన్.శ్వేత తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుత ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న సింధు శర్మ సైతం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో చురుకుగా పనిచేస్తూ గుర్తింపు పొందారు. జిల్లా అటవీ అధికారి నిఖిత కూడా పనితీరుతో మన్ననలు పొందుతున్నారు. ఆడపిల్లలపై వివక్ష చూపకుండా వారిని ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారని వారు నిరూపిస్తున్నారు.

ఆడపిల్ల మైనస్ అనుకుంటూ..

ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణిస్తున్నా.. సమాజంలో ఇంకా వారి మీద వివక్ష కొనసాగుతూనే ఉంది. ఆడపిల్ల పుడితే మైనస్ అని, మగ బిడ్డ అయితే ప్లస్ అని అంటూ వివక్ష చూపిస్తున్నారు. మగబిడ్డే వారసుడనే భావనతో కడుపులో పెరిగే బిడ్డ ఆడా? మగా? అన్నది తెలుసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయించి కడుపులో పెరిగేది ఆడబిడ్డ అని తేలితే అబార్షన్ చేయిస్తున్నారు. జిల్లాలో ఆడపిల్లల సంఖ్య ఏడాదికేడాది తగ్గిపోవడానికి అబార్షన్లే కారణమని స్పష్టమవుతోంది. గతేడాది జిల్లాలో 11,304 మంది పిల్లలు పుడితే అందులో ఆడపిల్లల సంఖ్య 5,304 కాగా మగ పిల్లల సంఖ్య 6,000. అంటే మగ పిల్లల కన్నా 696 మంది ఆడపిల్లలు తక్కువగా పుట్టారు. జిల్లాలో విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, పుట్టేది ఆడపిల్ల అని తెలిస్తే చాలు అబార్షన్ చేయించడం సర్వసాధారణంగా మారిపోయాయి. ఆడపిల్ల మైనస్ అని, వారసుడు అంటే మగపిల్లవాడే అన్న భావన వీడాల్సిన అవసరం ఉంది.



కూతుళ్లతో నీలం ప్రమీల, రాజులు దంపతులు

కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు నీలం రాజులు-ప్రమీల దంపతులకు ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురు తేజస్విని, చిన్నకూతురు చైతన్యశ్రీ సాఫ్ట్‌వేర్ డెవలపర్లు కాగా.. రెండో కూతురు వేదశ్రీ ఎంఎస్‌డబ్ల్యూ చదివి ఉద్యోగం చేస్తోంది. ముగ్గురూ కూతుళ్లేనని ఏనాడూ కుంగిపోలేదని, వారిని బాగా చదివించి ఉన్నతంగా తీర్చిదిద్దామని ప్రమీల, రాజులు పేర్కొంటున్నారు.



కూతుళ్లతో లొల్లేటి గీత, నారాయణరావ్ దంపతులు

కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లికి చెందిన లొల్లేటి నారాయణరావ్-గీత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. సొంతూరులో ఉండి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునే నారాయణరావ్ ఇద్దరు కూతుళ్లను ఉన్నతంగా చదివించారు. ఇద్దరు కూతుళ్లు భాగ్యశ్రీ, రమ్యశ్రీ సాఫ్ట్‌వేర్ డెవలపర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరు కూతుళ్లు చదివి ప్రయోజకులయ్యారని గీత, నారాయణరావ్ దంపతులు ఆనందంగా ఉన్నారు.



కూతుళ్లతో రాజేశ్వరి, దస్తాగౌడ్ దంపతులు

నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామానికి చెందిన దస్తాగౌడ్ ఆటో డ్రైవర్‌గా, ఆయన భార్య రాజేశ్వరి బీడీలు చుడుతూ జీవనం సాగిస్తున్నారు. వాళ్లకు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరినీ కష్టపడి చదివిస్తున్నారు. పెద్ద కూతురు సుచిత బీజీ.. చిన్న కూతురు చంద్రకళ డిగ్రీ చదువుతున్నారు. ఇద్దరూ చదువులో ముందున్నారని రాజేశ్వరి, దస్తా గౌడ్ పేర్కొంటున్నారు.



కూతుళ్లతో మీన, సాయాగౌడ్ దంపతులు

నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన సాయాగౌడ్ మీన దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు భాగ్యను బీటెక్ చదివించారు. ఆమెకు వివాహమైంది. చిన్న కూతురు శైలజ ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చదవడం కోసం ఇటీవలే ఆస్ట్రేలియా వెళ్లింది. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదని మీన, సాయాగౌడ్ పేర్కొంటున్నారు. వారిని బాగా చదివిస్తే ఉన్నతంగా ఎదుగుతారంటున్నారు.

క్లుప్తంగా

ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్

భిక్కనూరు: భిక్కనూరుకు చెందిన గుర్రాల ప్రవీణ్‌కుమార్ తెలంగాణ యూనివర్సిటీ నుంచి బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అనే అంశంపై ప్రవీణ్‌కుమార్ అధ్యాపకురాలు రాజేశ్వరీ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. బుధవారం నిర్వహించిన వైవాకు శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ పద్మావతి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ప్రవీణ్‌కుమార్‌ను అధ్యాపకులు వీరభద్రం, యాలద్రి నర్సయ్య, రమాదేవి, డాక్టరేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్ గౌడ్, నరేందర్‌రెడ్డి, సత్యం అభినందించారు.

టీఎన్‌జీవోస్ సభ్యత్వం తీసుకున్న సహకార ఉద్యోగులు

కామారెడ్డి అర్బన్: ఉద్యోగుల హక్కులపై నిరంతరం పనిచేస్తున్న టీఎన్‌జీవోస్ సభ్యత్వం కలిగి ఉండడం గర్వంగా ఉందని జిల్లా సహకార శాఖ ఉద్యోగులు అన్నారు. సంఘం ప్రాథమిక సభ్యత్వాన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, బొమ్మని సాయిలు చేతుల మీదుగా సహకార శాఖ ఉద్యోగులు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు చక్రధర్, నాగరాజు, సాయిలు, సుజాత, వెంకట్, శివకుమార్, జానయ్య పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బుధవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కౌన్సిలర్ గడ్డమీది రాణి, హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయక్‌పోడ్‌ల సమస్యలు పరిష్కరించాలి

నిజాంసాగర్(జుక్కల్): నాయక్‌పోడ్ కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని నాయక్‌పోడ్ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కలిసి విన్నవించారు. జిల్లా అధ్యక్షుడు పెంటయ్య, సాయిబాబా, గణేశ్, శంకర్, సాయిలు, రవీందర్, సంజీవ్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఈసారైనా పనులు సాగేనా!

- 2016లో నాగిరెడ్డిపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాల మంజూరు
- భవన నిర్మాణానికి ఏడేళ్ల క్రితం నిధుల కేటాయింపు
- పలు కారణాలతో నిలిచిపోయిన పనులు
- రీ టెండర్ నిర్వహించి పునః ప్రారంభించిన అధికారులు



నాగిరెడ్డిపేటలో కొనసాగుతున్న గురుకుల పాఠశాల భవనం పనులు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట గిరిజన గురుకుల పాఠశాల పనులు ఏడేళ్లుగా ఆగుతూ.. సాగుతున్నాయి. దీంతో సొంత భవనం లేక పాఠశాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. పక్కా భవనం కోసం పనులు ప్రారంభించిన ప్రతిసారీ స్థలవివాదం కారణంగా నిలిచిపోతున్నాయి. ఈ సారైనా ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా పాఠశాల భవన నిర్మాణం సజావుగా సాగాలని మండల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. నాగిరెడ్డిపేట మండలానికి 2016లో గిరిజన బాలుర గురుకుల పాఠశాల మంజూరయింది. అప్పట్లో అధికారులు నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని ఓ అద్దెభవనంలో గురుకుల పాఠశాలను ప్రారంభించారు.

తర్వాత యేడు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో అప్పటివరకు ఉన్న భవనం సరిపోలేదు. దీంతో మండలంలోని మాల్తుమ్మెదలోని మరో అద్దెభవనంలోకి పాఠశాలను మార్చారు. మరుసటి ఏడాది గురుకుల పాఠశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభం కావడంతో కామారెడ్డి సమీపంలోని సరంపల్లి వద్దనున్న మరో అద్దె భవనంలోకి మార్చారు, అప్పటి నుంచి నాగిరెడ్డిపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాల అక్కడే కొనసాగుతోంది.

స్థల వివాదంతో..

పాఠశాలకు సొంత భవనం కోసం 2017లో అప్పటి ప్రభుత్వం రూ.4.40 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతోపాటు గోపాల్‌పేట హెచ్‌ఎంబీ ప్రధాన రహదారి పక్కన 7ఎకరాల13గుంటల భూమిని కేటాయించారు. కాగా పాఠశాల భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలం గతంలోనే ఓ రైతుకు కేటాయించడంతో సదరు రైతు కోర్టును ఆశ్రయించాడు. దీంతో స్థల వివాదం ఏర్పడి పాఠశాల భవన నిర్మాణానికి ఆటంకం కలిగింది. అనంతరం కొంతకాలానికి స్థలవివాదం తొలగిపోవడంతో తిరిగి పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అదేసమయంలో మెదక్ –బోధన్ రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి నిధులు సైతం మంజూరు చేసింది. ప్రస్తుతం పాఠశాల భవన నిర్మాణం జరుగుతున్న స్థలం వరకు రోడ్డు విస్తరణ జరుగుతుందనే కారణంతో మరోసారి పనులకు ఆటంకం కలిగింది. దీంతో భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పనులను చేయకుండానే అర్ధాంతరంగా వదిలేసి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అధికారులు మరోమారు టెండర్ ప్రక్రియ చేపట్టడంతో మరొకరు దక్కించుకొని ఇటీవలే పనులు ప్రారంభించారు.

ప్రైవేట్‌కు దీటుగా బోధించాలి

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి(కేవీఆర్) విద్యాశాఖ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలన్నారు. డీఈవో ఎస్ రాజు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

రెవెన్యూ శాఖకు సంబంధించిన ధరణి, భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని ఎమ్మెల్యే కేవీఆర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రూ.250 కోట్లతో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో రూ.250 కోట్లతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిలో బస్ డిపో నిర్మాణం కోసం మంత్రితో మాట్లాడానని చెప్పారు. సీసీ రోడ్డు, ఇతర పనుల కోసం రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, లైటింగ్, పార్కు తదితర పనులు త్వరలో పూర్తవుతాయన్నారు. ఎల్‌వోసీలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించడంలో రాష్ట్రంలో ఎల్లారెడ్డి ముందు ఉందన్నారు. ఎల్లారెడ్డి ఐటీఐ కళాశాలలో పూర్తి స్థాయిలో అన్ని కోర్సుల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు సాయిబాబా, వినోద్‌గౌడ్, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, విద్యాసాగర్, గోపి, గఫార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సామెల్, ఊషాగౌడ్ పాల్గొన్నారు.

బీర్షేబా ఆస్తులను కొనుగోలు చేస్తే చర్యలు



ఇల్లును సీజ్ చేస్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్: అమాయకులను మోసం చేసిన వ్యవహారంలో బీర్షేబా కంపెనీకి చెందిన సీజ్ చేసిన ఆస్తులను ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. సీజ్ చేసిన ఇల్లును కొనుగోలు చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 2020లో వివేకానంద కాలనీలో కొనసాగిన బీర్షేబా కంపెనీపై కేసుతోపాటు ఆ కేసులో నేరస్తుడైన షేక్ ఇస్మాయిల్, అతడి భార్య సమీనా ఆస్తులను సీజ్ చేశారు. ఇస్మాయిల్ భార్య పేరిట వివేకానంద కాలనీలో ఉన్న సీజ్ చేసిన ఇంటిని, ఓ ప్లాట్‌ను పట్టణానికి చెందిన లాలమ్మల అంజన్‌కుమార్ 2023లో కొనుగోలు చేశాడు. సీజ్ చేసిన ఇంటిలోని సామగ్రిని బుధవారం వ్యాన్‌లో తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. బీర్షేబా కంపెనీకి చెందిన ఆస్తులను ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానీపేట ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల (2001 – 02) ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. 23ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

ఫోర్జరీ సంతకాలతో హోమ్‌లోన్స్

- కమీషన్ల కోసం మధ్యవర్తుల కక్కుర్తి
- నస్రుల్లాబాద్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులకు ఫిర్యాదు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): గ్రామ పంచాయతీ స్టాంపులు ముద్రించి, రసీదు బుక్కులు తయారు చేసి కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ముగ్గురు వ్యక్తులు లోన్‌లు తీసుకున్న ఘటన నస్రుల్లాబాద్ మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రైవేట్ ఫైనాన్స్ బాధ్యులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకుండా లోన్‌లు మంజూరు చేసినట్లు తెలిసింది. మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన సాలావత్ మంగ్యా సర్వే నంబర్ 22/4/1లో పౌల్ట్రీఫామ్ ఏర్పాటుకు నకిలీ ఎన్‌వోసీ తయారు చేశాడు. అలాగే గ్రామానికి చెందిన నేనావత్ శ్రీకాంత్, సలావత్ శ్రీను సైతం గ్రామ పంచాయతీ స్టాంపులు, రసీదు బుక్కులు తయారు చేయించి గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం ఆ పత్రాలతో ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఒకరు రూ.4లక్షలు, మరొకరు రూ.5లక్షల లోన్ తీసుకున్నారు. సదరు వ్యక్తులు రెండు నెలలుగా ఈఎంఐలు చెల్లించకపోవడంతో వసూలుకు వచ్చిన ప్రైవేట్ ఫైనాన్స్ సిబ్బందికి అసలు విషయం తెలిసింది. వారు వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై కార్యదర్శి రజిత ఈనెల 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేసు బుక్ చేయడం లేదు

హాజీపూర్ ఘటనపై ఫైనాన్స్ అధికారులు తమకు ఫిర్యాదు చేయగానే మేము పోలీసులకు ఫిర్యాదు చేశాం. గత మూడు రోజులుగా కేసు బుక్ చేస్తామని, కొత్త చట్టం వచ్చిందంటు కాలయాపన చేస్తున్నారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడమే కాకుండా గ్రామ పంచాయతీ స్టాంపులు, రసీదు బుక్కులు ముద్రించారని ఫిర్యాదులో పేర్కొన్నాం. లోన్‌లు ఇచ్చే వారు ధ్రువీకరణ పత్రాలను పూర్తిగా పరిశీలించి గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఉంటే ఇలా జరిగేది కాదు.

– రాము, ఎంపీవో, నస్రుల్లాబాద్

'డబుల్' లబ్ధిదారులది మరో గోస

సొంత స్థలాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకుని ప్రభుత్వ బిల్లుల కోసం ఎదురు చూస్తున్న వారి పరిస్థితి మరోలా ఉంది. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులను తీర్చేందుకు ప్రైవేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. వారి అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న మధ్యవర్తులు నకిలీ పత్రాలు సృష్టిస్తూ లోన్‌లు ఇప్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి. హోం లోన్‌ల మంజూరు నస్రుల్లాబాద్ మండలం ఎక్కువ సంఖ్యలో ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ప్రైవేట్ ఫైనాన్స్‌లు క్షేత్రస్థాయిలో సరైన విచారణ లేకుండా లోన్‌లు మంజూరు చేస్తుండడంతో మధ్యవర్తుల దందా మూడు పూలు, ఆరు కాయలుగా సాగుతోందని పలువురు అంటున్నారు.

ఆర్టీసీ బస్సులో సెల్‌ఫోన్ మాయం



తనిఖీ చేస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బోధన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణికుడి సెల్‌ఫోన్ మాయం కావడంతో బస్సును పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపి బస్సులోని వారందరినీ తనిఖీ చేసిన ఘటన నాగిరెడ్డిపేటలో బుధవారం చోటుచేసుకుంది. టీజీ 16 జెడ్ 0021నంబర్ గల ఎక్స్‌ప్రెస్ బస్సు బుధవారం ఉదయం బోధన్ నుంచి బాన్సువాడ మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరగా, అందులో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన గోపాల్ అనే యువకుడు ఎక్కాడు. బస్సు నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటకు చేరుకోగానే తన ఫోన్‌ను ఎవరో దొంగిలించారని గోపాల్ బస్సులోని కండక్టర్‌కు తెలిపాడు. దీంతో బస్సును నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపి ఏఎస్సై లచ్చిరాం అందులోని ప్రయాణికులందరినీ కిందకు దింపి తనిఖీ చేశారు. అయినప్పటికీ ఫోన్ దొరకకపోవడంతో బస్సును పంపించేశారు.

రోడ్డు ప్రమాదంలో కోడలు.. అనారోగ్యంతో అత్త మృతి

- బషీరాబాద్‌లో విషాదఛాయలు



భూదేవి, లావణ్య (ఫైల్)

మోర్తాడ్: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌కు చెందిన ఆకుల లావణ్య(40) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందగా అమెరికాలో ఉంటున్న కూతురు వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా అనారోగ్యంతో బాధపడుతున్న లావణ్య అత్త ఆకుల భూదేవి(70) బుధవారం మృతి చెందింది. ఒక్క రోజు వ్యవధిలోనే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అత్తాకోడళ్ల అంత్యక్రియలను ఒకేసారి నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి: మురికి కాలువలో పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ప్రవీణ్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 8వ తేదీన దుబ్బలోని ఓ వైన్స్ ఎదుట ఉన్న మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి పడగా, అతడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజామాబాద్ రూరల్: పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం సాయంత్రం దాడి చేశారన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.11,500 నగదును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారన్నారు.

పోక్సో కేసు నమోదు !

ఎడపల్లి: జిల్లా కేంద్రానికి చెందిన యువకుడికి, హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన బాలికకు వివాహం చేసిన ఇస్మాయిల్ ఖాన్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైనట్లు తెలిసింది. ఎడపల్లికి చెందిన ఇస్మాయిల్‌ను ముషీరాబాద్ పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని దేవునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు బియ్యం తరలిస్తున్న వాహనం పట్టుబడింది. వెంటనే వారు సివిల్ సప్లయిస్ డీటీ కిష్టయ్యకు సమాచారం అందించారు. సరంపల్లి నుంచి కామారెడ్డికి అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బెజుగం విజయ్‌కుమార్ అనే వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యార్థినులను వేధించిన ఉపాధ్యాయుడు

బాన్సువాడ రూరల్: మండలంలోని ఓ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులను లైంగిక వేధించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఉపాధ్యాయుడు ల్యాబ్ గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యార్థినులు విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని సదరు ఉపాధ్యాయుడిని నిలదీసి దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. 'పోలీసులకు ఫిర్యాదు చేస్తే మీ పరువే పోతుందని, మేము కూడా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తామని' కొందరు బెదిరించడంతో తల్లిదండ్రులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలిక అదృశ్యం

ఎల్లారెడ్డి: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక మంగళవారం కళాశాలకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. అయినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాటర్ ట్యాంకర్ చోరీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజీవాడి గ్రామ శివారులోని రైతు వేదిక వద్ద ఉన్న వాటర్‌ట్యాంకర్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. వాటర్‌మెన్ స్వామి ఈనెల 7వ తేదీన నర్సరీలోని మొక్కలకు నీరు పట్టి అక్కడే నిలిపివేశాడు. మరుసటి రోజు వెళ్లి చూడగా ట్యాంకర్ కనిపించలేదు. గ్రామ కార్యదర్శి చంద్రకళ తాడ్వాయి పోలీస్ స్టేషన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్లాట్ కబ్జా చేశారని ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని అమ్మ వెంచర్‌లో ఉన్న తన ప్లాట్‌ను కబ్జా చేశారని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌కు అక్షయ్ అనే వ్యక్తి బుధవారం ఫిర్యాదు చేశారు. అమ్మ వెంచర్‌లో తాను కొనుగోలు చేసిన 160 గజాల ప్లాట్‌ను కార్పొరేటర్ భర్త కబ్జా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు ప్లాట్‌ను విక్రయించిన వ్యక్తితోపాటు కార్పొరేటర్ భర్తను సంప్రదించినా వారు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత, అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి, మద్యానికి బానిసై మరో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. మరో వ్యక్తి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అత్తింటి వేధింపులు తాళలేక..



లావణ్య(ఫైల్)

ఖలీల్‌వాడి: అత్తింటి వేధింపులు తాళలేక నిజామాబాద్ నగరంలోని ఆర్యనగర్‌లో లావణ్య(23) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి పోలీసులకు చేసిన ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి.. సుభాష్‌నగర్‌కు చెందిన లావణ్యకు ఆర్యనగర్‌కు చెందిన వెంకటేశ్‌తో ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.30 లక్షల నగదుతోపాటు 33 తులాల బంగారాన్ని లావణ్య పుట్టింటివారు ఇచ్చారు. ఆ తరువాత అదనపు కట్నం కోసం లావణ్యను ఆమె భర్త పాపన్నతోపాటు అత్త నాగమణి, భర్త వెంకటేశ్ వేధించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం అర్ధరాత్రి పుట్టింట్లో విషం సేవించి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లావణ్య మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయా సంఘాల నాయకులు నాయుడు రాజు, అంగారి ప్రదీప్, తారాచంద్, కోనేరు సాయికుమార్ తదితరులు డిమాండ్ చేశారు.

మద్యానికి బానిసై రైలు కిందపడి..

ఖలీల్‌వాడి: మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తి చెందిన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన మహ్మద్ షకీల్ (30) లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇటీవల మద్యానికి బానిసైన షకీల్ మంగళవారం సైతం మద్యం తాగి ఇంటికి వెళ్లగా తల్లిదండ్రులు మందలించారు. ఇంట్లో నుంచి బయటికి వచ్చిన షకీల్ మాధవ నగర్ వద్ద గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధ తాళలేక..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కాలోజీవాడి గ్రామానికి చెందిన గడ్డం రామకృష్ణ(40) అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న రామకృష్ణ గతంలో స్థానికంగా రూ.లక్ష అప్పు చేశాడు. రెండు నెలల క్రితం రూ.45వేలు తిరిగి ఇచ్చేసిన రామకృష్ణను మిగతా డబ్బులు ఇవ్వాలని అప్పు ఇచ్చిన వారు తరచూ అడిగారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 9న స్వగ్రామానికి వచ్చి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య బుధవారం ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బరంగెడ్గిలో..



వడ్ల కృష్ణ (ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ మండలం బరంగెడ్గికి చెందిన వడ్ల కృష్ణ (35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో కృష్ణ ఉరేసుకున్నాడని, అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

భిక్కనూరు: మండలకేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. కూలెంట్ వాటర్ సరఫరా చేసే కరీంనగర్ జిల్లా ఏజెన్సీకి చెందిన వాహనం భిక్కనూరుకు వచ్చి తిరిగి కామారెడ్డి వైపు వెళ్తుండగా బైపాస్ యూటర్న్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. వాహనంలో ఉన్న కరీంనగర్ రూరల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన సేల్స్‌మెన్ శేఖర్‌గౌడ్ (45) అక్కడి కక్కడే మృతి చెందగా, డ్రైవర్ సాజిద్, షకీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో..

జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి తరువాత బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో నిజామాబాద్ నగరానికి చెందిన షేక్ షకీల్ (27)మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. షకీల్ తన స్నేహితుడైన జుబేర్‌తో కలిసి మంగళవారం ఉదయం బైక్‌పై సంగారెడ్డికి వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి తరువాత తిరిగి నిజామాబాద్‌కు వస్తుండగా బైక్‌ను లారీ ఢీకొట్టింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు షకీల్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

18 గంటలు.. 4 రోడ్డు ప్రమాదాలు



జాతీయ రహదారిపై బోల్తా పడిన వాహనం

భిక్కనూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై 18 గంటల వ్యవధిలో నాలుగు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాలన్నీ కేవలం నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే చోటు చేసుకోగా.. ఇద్దరు మృతి చెందారు. ఏడుగురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై చర్చి సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, టాటా ఏస్ వాహనం డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కరీంనగర్ వాసి మృతి చెందాడు. ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే పోలీస్ స్టేషన్ వెనుకవైపు జాతీయ రహదారిపై మెదక్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న వ్యాన్ బోల్తాపడగా పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇద్దరూ కూలీలకు గాయాలపాలయ్యారు. అలాగే బుధవారం సాయంత్రం చేగుంట మండలానికి చెందిన ఇద్దరు యువకులు కామారెడ్డి వైపు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి గాయాలపాలయ్యారు.